# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 16-06-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ భారత్ - సైప్రస్ దేశాల మధ్య ఉన్న క్రియాశీలక భాగస్వామ్యం భవిష్యత్ నూతన శిఖరాలకు చేరుకుంటుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ విశ్వాసం వ్యక్తం చేశారు.
- ❖ దేశంలోని ప్రతి జిల్లాకు విపత్తు నిర్వహణ ప్రణాళికను సిద్ధం చేయాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆదేశించారు.
- ❖ జనగణనకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఈరోజు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది.
- ❖ ఇరాన్‌లోని భారతీయ విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు భారత ప్రభుత్వం చర్యలు చేపట్టిందని విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది.
- ❖ ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 123వ సంచిక ఈనెల 29న ప్రసారమవుతుంది.

================================

సైప్రస్ పర్యటనలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఆ దేశ అత్యున్నత పురస్కారమైన 'గ్రాండ్ క్రాస్ ఆఫ్ ఆర్డర్ ఆఫ్ మకరియోస్ 3'ను సైప్రస్ దేశాధ్యక్షులు నికోస్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ... ఇది 140 కోట్ల మంది భారతీయులకు దక్కిన గౌరవమన్నారు. ఇరు దేశాల సంస్కృతి, సోదరభావం, వసుధైవ కుటుంబకం భావనకు ఇది ప్రతీక అని పేర్కొన్నారు. ఈ పురస్కారాన్ని రెండు దేశాల మధ్య ఉన్న స్నేహానికి అంకితం చేస్తున్నానని ప్రకటించారు. ఇరుదేశాల శాంతిభద్రతలు, సార్వభౌమాధికారం, ప్రాంతీయ సమగ్రత, శ్రేయస్సుపై పరస్పర నిబద్ధతను ఈ గుర్తింపు మరింత బలపరుస్తుందని పేర్కొన్నారు. భారత్ - సైప్రస్ మధ్య ఉన్న క్రియాశీలక భాగస్వామ్యం భవిష్యత్ నూతన శిఖరాలకు చేరుకుంటుందని నరేంద్రమోదీ విశ్వాసం వ్యక్తం చేశారు.

(వాయిస్ 40 సెకన్లు)

కాగా కొద్ది సేపటి క్రితం సైప్రస్ పర్యటన ముగించుకుని ప్రధానమంత్రి కెనడా బయలుదేరి వెళ్లారు. ఈ పర్యటనలో భాగంగా రేపు జరగనున్న జీ7 సదస్సులో పాల్గొంటారు.

================================

జనగణనకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఈరోజు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. రెండు దశల్లో జరగబోయే ఈ జనగణన 2026 అక్టోబర్ 1న ప్రారంభమై 2027 మార్చి 1న ముగియనుంది. ఈ మేరకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. దేశ వ్యాప్తంగా చేపట్టే ఈ 16వ జనగణనకు సంబంధించి హోం శాఖ కొన్ని సూచనలు చేసింది. దాదాపు ఆరు నెలల పాటు జరిగే ఈ లెక్కింపులో 34 లక్షల మంది అధికారులు, సూపర్ వైజర్లతో పాటు 1.34 లక్షల మంది సిబ్బంది భాగస్వామ్యం కానున్నారు. ఈ సారి జనగణనతో పాటు కులగణనా కూడా చేపట్టబోతున్నారు. ఇంతకు ముందులా కాకుండా ఈసారి లెక్కింపు పూర్తిగా ట్యాబ్‌ల సహాయంతో డిజిటల్ రూపంలోనే జరగబోతోంది.

================================

దేశంలోని ప్రతి జిల్లాకు విపత్తు నిర్వహణ ప్రణాళికను సిద్ధం చేయాలని హోం శాఖ మంత్రి అమిత్ షా రాష్ట్ర సహాయ కమిషనర్లను కోరారు. ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన రాష్ట్రాల, కేంద్ర పాలిత ప్రాంతాల సహాయ కమిషనర్లు, విపత్తు ప్రతిస్పందన దళాల సమావేశంలో హోం మంత్రి మాట్లాడుతూ.. విపత్తులను ఎదుర్కోవడానికి రాబోయే 90 రోజుల్లో ప్రతి జిల్లాకు జిల్లా స్థాయి నిర్వహణ ప్రణాళికను సిద్ధం చేయాలని కోరారు. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (NDMA), జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (NDRF), విపత్తు నిరోధక మౌలిక సదుపాయాల కూటమి (CDRI)లు విపత్తు నిర్వహణలో భారతదేశాన్ని ప్రపంచంలోనే అగ్ర స్థానంలో నిలిపాయని అమిత్ షా పేర్కొంటూ...

(వాయిస్ 40 సెకన్లు)

================================

ఇరాన్‌లో  ఇజ్రాయెల్ చేపట్టిన దాడుల నేపథ్యంలో భారతీయ విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు భారత ప్రభుత్వం చర్యలు  చేపట్టిందని విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఇరాన్‌లోని భారతీయ విద్యార్థుల భద్రతను నిర్ధారించడానికి సాధ్యమైన అవకాశాలన్నింటినీ ఎంపికలను పరిశీలిస్తున్నామనితెలిపింది. టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం, ఇరాన్‌లోని భారతీయ విద్యార్థులతో నిరంతరం సంప్రదిస్తూ.. వారి భద్రతను నిర్ధారించేందుకు చర్యలు తీసుకుంటోందని వెల్లడించింది. కొందరు విద్యార్థులను ఇరాన్‌లోని సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో రాయబార కార్యాలయం సహాయం అందిస్తోందని, భారతీయుల సంక్షేమం, భద్రతను కాపాడేందుకు కృషి చేస్తోందని వెల్లడించింది.

విరామం

================================

భారత రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (DRDO), IIT ఢిల్లీ సంయుక్తంగా  ఫ్రీ స్పేస్ క్వాంటం సెక్యూర్ కమ్యూనికేషన్‌ను అభివృద్ధి చేశాయని రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. భవిష్యత్ లో క్వాంటం ఇంటర్నెట్ అభివృద్ధికి ఇది మార్గం సుగమం చేస్తోందని పేర్కొంది. దేశాభివృద్ధి కోసం క్వాంటం సాంకేతికతను విస్తృత చేయాలనే లక్ష్యంలో భాగంగా దీనిని రూపొందించారు. రక్షణ, ఆర్థిక, టెలికమ్యూనికేషన్స్ వంటి రంగాలలో డేటాను భద్రపరచడంలో.. అలాగే జాతీయ భద్రతకు సంబంధించిన కమ్యూనికేషన్‌లను రక్షించడంలో ఇది దోహదపడుతుంది. ఈ విజయం పట్ల రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ DRDO, IIT ఢిల్లీని అభినందించారు. భారతదేశం సురక్షితమైన నూతన క్వాంటం యుగంలోకి ప్రవేశించిందని, ఇది భవిష్యత్ యుద్ధంలో కీలకపాత్ర పోషిస్తుందని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.

================================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 123వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 27వ తేదీ వరకు పంపవచ్చు.

==============================

గతంలో సంవత్సరానికి ఒకసారి మాత్రమే నిర్వహించే నర్సింగ్ ఆఫీసర్ రిక్రూట్‌మెంట్ కామన్ ఎలిజిబిలిటీ టెస్ట్ - NORCET, ఇక నుండి సంవత్సరానికి రెండుసార్లు నిర్వహించనున్నామని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ తెలిపింది. దీంతో సకాలంలో నియామకాలు, రోగుల నిరంతరాయ సంరక్షణా సేవలను నిర్ధారించేందుకు ది సులభతరం కానుందని పేర్కొంది. ఈ విధాన మార్పు AIIMS, వ్యూహాత్మక ప్రణాళికకు అనుగుణంగా ఉంటుందని వెల్లడించింది. ప్రధాన మంత్రి స్వాస్థ్య సురక్ష యోజన కింద ఏర్పాటు చేయబడిన నూతన AIIMS తో పాటు కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రులతో సహా అన్ని AIIMS ల కోసం NORCET- 2025 పరీక్షను AIIMS న్యూఢిల్లీ నిర్వహించింది.

==============================

ఎంప్లాయీ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (EPFO) సభ్యులు సురక్షితమైన, ఉచిత ఆన్‌లైన్ సేవల కోసం అధికారిక EPFO పోర్టల్‌లను వినియోగించాలని కేంద్ర కార్మిక ఉపాధి మంత్రిత్వ శాఖ తెలిపింది. ఎటువంటి అనధికారిక ఏజెంట్లను సంప్రదించవద్దని ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. సభ్యులకు వేగవంతమైన, పారదర్శక సేవలను అందించేందుకు EPFO అనేక చర్యలు తీసుకుందని తెలిపింది. ఫిర్యాదుల పర్యవేక్షణ, పరిష్కార వ్యవస్థను EPFO కలిగి ఉందని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఫిర్యాదుల నిర్వహణ వ్యవస్థకు అందిన ఫిర్యాధులలో 98 శాతం గడువు లోగా పరిష్కరించామని పేర్కొంది.

==============================

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 21న విశాఖపట్నంలో నిర్వహిస్తున్న యోగా దినోత్సవ వేడుకల ఏర్పాట్లను కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉన్నత అధికారుల బృందం పరిశీలించింది. ఆయుష్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి వైద్య రాజేష్ కోటేచా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ ఆధ్వర్యంలో ఈ ప్రతినిధి బృందం RK బీచ్, రిషికొండ బీచ్, ఆంధ్ర విశ్వవిద్యాలయం, గీతం విశ్వవిద్యాలయం వంటి ప్రధాన వేదికలను సందర్శించి, ఏర్పాట్లను పరిశీలించింది. అనంతరం జరిపిన సమీక్షలో యోగా ప్రదర్శనలు, సంబంధిత సాంస్కృతిక కార్యక్రమాలు జరుగు ప్రదేశాల్లో ప్రజా సమీకరణ, మౌలిక సదుపాయాల సంసిద్ధత, అంతర్-విభాగాల సమన్వయం, భద్రతా ప్రోటోకాల్లపై అధికారులు వివరణాత్మక చర్చలు జరిపారు.

==============================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు భారీ లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 81,118 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమై.. చివరికి 677 పాయింట్ల లాభంతో 81,796 వద్ద ముగిసింది.

==============================

==============================